
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం। 19। ఏప్రిల్। 2024



అప్పన్న కల్యాణం చూతము రారండోయ్ 14లో




విశాఖ ఎయిర్‌పోర్టు దూకుడు! 8లో

# ఫ్యాను జోరు.. కూటమి బేజారు



- నామినేషన్ల ప్రక్రియ మొదలైనా తెగని టీడీపీ సీట్ల పంచాయితీ
- మాడుగుల, అరకు నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- దక్షిణ నియోజకవర్గంలో చల్లారని 'గ్లాసు' తుపాను
- వంశీకృష్ణకు వద్దే వద్దంటున్న జనసేన నాయకులు
- గందరగోళంలో మూడు పార్టీల క్యాడర్

సాక్షి, విశాఖపట్నం: ఓ వైపు భానుడి భగభగలు.. మరోవైపు సార్వత్రిక ఎన్నికల వేడి సెగలు పుట్టిస్తుంటే.. కూటమిలో ఇంకా టికెట్ల పంచాయితీ కుంపటి రగులుతూనే ఉంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా.. సీట్ల సర్దుబాటులో నెలకొన్న గందరగోళం కొనసాగుతూనే ఉంది. చంద్రబాబు మార్పుల వైఖరికి జనసేన, బీజేపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. మాడుగులలో సైకిల్ తొక్కేదెవరో తెలియక అయోమయంలో క్యాడర్ ఉండగా.. అరకులో కమలం వికసించకుండా టీడీపీ యత్నాలు జోరందుకున్నాయి. విశాఖ దక్షిణంలో జనసేన అభ్యర్థి వద్దేవద్దంటూ ఆ పార్టీ నేతలే తేల్చి చెబుతుండటంతో ఎటుపోవాలో తెలియక క్యాడర్ ఊగిసలాడుతోంది.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ తరుణంలో వైఎస్సార్ సీపీ దూకుడుగా వ్యవహరిస్తుంటే.. కూటమి మాత్రం పొత్తు చిక్కుల్లో కూరుకుపోయింది. చివరి నిమిషం వరకూ ఎవరికి సీటు దక్కుతుందో తెలియక అయోమయంలో టీడీపీ శ్రేణులు కలవరపడుతున్నారు. ముఖ్యంగా మాడుగుల, అరకు నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. మాడుగులలో తొలుత పైలా ప్రసాదరావుకు చంద్రబాబు సీటు ప్రకటించారు. దీంతో ఆయన ప్రచారానికి ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేశారు. అయితే తాజాగా ఈ సీటును తనకే కేటాయించారని బండారు ప్రకటించుకున్నారు. దీంతో పైలా వర్గం కోపంతో రగిలిపోతోంది. ఇన్నాళ్లూ ఈ టికెట్ ఆశించిన గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్‌లకు భంగపాటు తప్పలేదు. పెందుర్తి నుంచి మాడుగులకు బండారు రావడంతో అక్కడ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది. మాడుగులలో గురువారం బండారు నిర్వహించిన సమావేశానికి పైలా గైర్హాజరయ్యారు. బండారు, చంద్రబాబు తీరుపై టీడీపీ శ్రేణులు ఆగ్రహంతో పాటు అయోమయానికి గురవుతున్నారు.

**అరకులోనే అదే దుస్థితి**

రాష్ట్రంలోనే మొట్టమొదట ప్రకటించిన టీడీపీ సీటు అరకు నియోజకవర్గానిదే. దొన్ను దొర అరకు అభ్యర్థి అంటూ బాబు ప్రజాగళం సభలో ప్రకటించారు. అప్పటి నుంచి ప్రచారం నిర్వహించిన దొన్ను దొరకు చివరికి భంగపాటు తప్పలేదు. ఆ స్థానాన్ని బీజేపీకి ఇస్తున్నట్లు బాబు ప్రకటించడంతో అసమ్మతి భగ్గుమంది. వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు తన తడాఖా చూపిస్తానంటూ దొన్నుదొర బహిరంగంగా సవాల్ విసిరారు. దీంతో అరకులో కూటమి రెండు ముక్కలైంది. బీజేపీ అభ్యర్థితో పాటు నడవాలా..? రెబల్‌గా అడుగులు వేస్తున్న దొన్ను దొరతో ఉండాలా అని తేల్చుకోలేక మూడు పార్టీల క్యాడర్ గందరగోళంలో ఉంది. మరోవైపు అరకులో కమలం వికసించకుండా ఆపేందుకు టీడీపీ యత్నాలు కొనసాగిస్తూనే ఉంది.

### జనసేనది ఇదే పరిస్థితి

అటు జనసేనకు సంబంధించి దక్షిణ నియోజకవర్గంలోనూ అసమ్మతి ఇంకా కొనసాగుతోంది. బీఫారం దక్కించుకున్న వంశీకృష్ణకు సీటు ఇవ్వొద్దంటూ పలువురు నేతలు ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నారు. వంశీని కొనసాగిస్తే.. ఓడించి తీరుతామంటూ తేల్చి చెబుతున్నారు. జనసేనలోనే వర్గపోరు ఉండటంతో.. ప్రచారానికి వెళ్లకుండా ఆ పార్టీ శ్రేణులు ఇంటికే పరిమితమవుతున్నారు. కీలక నేతలు ప్రచారానికి డుమ్మా కొడుతుండటంతో.. వారు లేకుండా ప్రచారానికి వెళ్తే.. తమని బ్లాక్ లిస్టులో పెడతారేమోనన్న సంకట స్థితిలో మూడు పార్టీల క్యాడర్‌లో ఉంది. బయటికి రాలేక.. నియోజకవర్గంలో తిరగలేక.. నాయకులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో ఆయా పార్టీల పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది. మొత్తానికి టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు పొడిచినా.. అది మునిగిపోయే పడవ మాత్రమేననే తత్వం ఆ పార్టీల కార్యకర్తల్లోనూ బలంగా నాటుకుంది.

# జగనన్నా.. మేమంతా సిద్ధం



- నేడు అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర
- కాకినాడ జిల్లా పర్యటన ముగించుకొని రాత్రికి గొడిచర్లలో బస చేయనున్న ముఖ్యమంత్రి
- ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ ఏర్పాట్లు
- రేపు ఉదయం 9 గంటలకు జిల్లాలో బస్సు యాత్ర ప్రారంభం
- గొబ్బూరు వద్ద సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ



గొబ్బూరు వద్ద బహిరంగ సభకు స్థల పరిశీలన చేస్తున్న పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

సాక్షి, అనకాపల్లి: జిల్లా ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం రాత్రి అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేపట్టిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా పర్యటన ముగించుకొని రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అనకాపల్లి జిల్లాలో అడుగుపెడతారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నర్సీపట్నం రోడ్డు జంక్షన్ వద్ద ప్రవేశించి, పాయకరావుపేట వై జంక్షన్, నామవరం మీదుగా గొడిచర్ల చేరుకుంటారు. సీఎం రాత్రికి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమై పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల మీదుగా అనకాపల్లి నియోజకవర్గం తాళ్లపాలెం సమీపంలోని గొబ్బూరు వద్దకు చేరుకుంటుంది. అక్కడ సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం కశింకోట, బయ్యవరం, అనకాపల్లి మీదుగా సాగే బస్సుయాత్ర విశాఖ జిల్లాలోకి ప్రవేశించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

**ఘన స్వాగతానికి ఏర్పాట్లు**

ఈనెల 19వ తేదీ శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధమవుతున్నారు. పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలకనున్నారు.

**సభ ఏర్పాట్ల పరిశీలన**

వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత చోడవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలనుకున్న బహిరంగ సభను కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద గొబ్బూరుకు మార్పు చేశారు. సభా ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తదితరులు గురువారం పరిశీలించారు.

**గొడిచర్ల వద్ద నైట్ హాల్ట్**

నక్కపల్లి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి జిల్లాలో ప్రవేశించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొడిచెర్లలో బస చేయనున్నారు. కాకినాడ జిల్లా పర్యటన పూర్తి చేసుకొని పాయకరావుపేట జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి మండలంలో గొడిచర్ల చేరుకుంటారు. అక్కడ రాత్రి బస చేస్తారు. ఇందుకోసం గొడిచర్ల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పదెకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ సీఎంతోపాటు ఆయన వెంట ఉండే కాన్వాయ్ వాహనాలు ఉండేందుకు వీలుగా స్థలాన్ని చదును చేశారు. సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న తదితరులు సీఎం నైట్‌హాల్ట్ చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఫ్చ్.. ముంచేసినట్టున్నారు

- ఎక్కడో తేడా కొట్టిందే..!
- భీమిలి టీడీపీ శ్రేణుల నిట్టూర్పు
- గంటా నామినేషన్‌కు తరలిరాని క్యాడర్
- డబ్బులిచ్చినా జాడలేని జనాలు



భీమిలిలో మద్యం దుకాణం వద్ద టీడీపీ కార్యకర్త



ఇంటికి వెళ్లిపోతున్న జనం

తగరపువలస: ఫ్చ్.. డబ్బులు పోయాయి... పరువూ పోయింది. మొత్తానికి భీమిలి ప్రజలు టీడీపీని ముంచేసినట్టున్నారు... ఇదీ.. భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు బుధవారం నామినేషన్ వేసిన సందర్భంగా సగటు టీడీపీ గ్రామీణ ఓటర్ మనోగతం. లచ్చల్లో కాకపోయినా వార్డుకు 2 వేల మంది, మండలానికి మరో 2 వేల మంది చొప్పున 24 వేల మందిని నామినేషన్‌కు తరలించాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఒక్కొక్కరికి దారి ఖర్చులు, భోజనం, మందుకు రూ.400 వంతున నాయకులు లెక్కలేసి పట్టుకుపోయారు. దీనికే రూ.కోటి వదిలింది. ఇవి కాక ఎలా లేదన్నా ఇతర ఖర్చులు అన్నీ కలిపి పాతిక లచ్చలు అయి ఉంటాయి. కానీ భీమిలిలో ఏ మూల చూసినా అంతమంది కనిపించలేదు. అనుకున్నది ఒకటి జరిగింది మరొకటి అని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకోవడం విశేషం. వేలాది మంది అనుకుంటే వందలాది మించలేదేనే నిట్టూర్పు కనిపించింది. జనసేన, బీజేపీ కలిసొచ్చినా టీడీపీని నమ్మలేదా? పోనీ వచ్చినోళ్లంతా టీడీపీకే ఓటేస్తారంటే ఆ నమ్మకమూ లేదు... రేపు మరోపార్టీ అభ్యర్థి నామినేషన్ వేసినా ఇందులోని సగం మంది వస్తారు.. ఎందుకు ఇంతటి అవమానం జరిగిందని ద్వితీయ శ్రేణి నాయకులు లెక్కలేసుకుంటున్నారు. ఎలక్షన్‌కో నియోజకవర్గం మార్చే గంటా అందుబాటులో ఉంటాడన్న నమ్మకం లేదు. గీతం భరత్‌ను కలవాలంటే నాయకులకే దిక్కు ఉండదు. అందుకేనా కూటమి అభ్యర్థులను జనం నమ్మడం లేదనే చర్చ మొదలైంది.

**మనోభావాలు ఉండవా..**

సొంత ప్రయోజనాల కోసం కొంతమంది మళ్లీ మళ్లీ పార్టీలు మారితే తామెందుకు మారాలి. తమకు మాత్రం ఆత్మసాక్షి, మనోభావాలు ఉండవా? ఇప్పుడు పార్టీ మారినోళ్లకు జగన్ పార్టీలో ఏమైనా తక్కువ జరిగిందా? నాయకుడు మారిపోయినంత మాత్రాన ఓటర్లు మారిపోతారనుకుంటే అది వారి పిచ్చే. ఈ రోజు నామినేషన్ సమయంలో అది స్పష్టమైందని అసలు టీడీపీ నాయకులు ఆలోచనలో పడ్డారు.

**ఉసూరు పెట్టిన కూటమి నాయకులు**

గంటా నామినేషన్ పర్వం ద్వితీయ, తృతీయ శ్రేణి కూటమి నాయకులకు కాసులు కురిపించింది. గంటా అనుచరులు ఒక్కొక్కరికి రవాణా, భోజనం, మద్యానికి కలిపి రూ.400 వంతున లెక్కించి ఇచ్చారు. ముందుగానే డబ్బులు అందుకున్న కొందరు నాయకులు సొంతానికి వాడేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని మద్యం దుకాణాల వద్ద ఖుషీ ఖుషీగా గడిపారు. నామినేషన్‌కు ముగిసిన తరువాత మహిళలు ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా వారికి మధ్యాహ్నం 3 గంటల వరకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఉసూరుమన్నారు. భోజనాలు కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురిచేశారు.

# హీటెక్కిన ఎన్నికలు

- విడుదలైన ఎలక్షన్ నోటిఫికేషన్
- నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభం
- హోరెత్తనున్న అభ్యర్థుల ప్రచారం
- ఊరూ వాడా సందడే సందడి

సాక్షి, విశాఖపట్నం: ఎండల వేడికి ఎన్నికల వేడి తోడైంది. నెల రోజుల క్రితం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆ తర్వాత రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటిస్తూ వచ్చారు. టికెట్లు ఖరారైన వారు ఇప్పటివరకు సాదాసీదాగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సీట్లపై ఊగిసలాటలో ఉన్న వారు నామమాత్రపు ప్రచారానికే పరిమితమయ్యారు. గురువారం శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ లాంఛనంగా జారీ అయింది. దాంతో పాటే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ కూడా ఆరంభమైంది. ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలుకు పండితులతో మంచి ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. తొలిరోజు గురువారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంపీ స్థానానికి మూడు, నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల దాఖలుకు ఈనెల 25 వరకు గడువు ఉండడంతో మిగిలిన వారు కూడా ఆలోగా వేయనున్నారు.

### వాహనాలు, ప్రచార రథాలు సిద్ధం



మే 13వ తేదీన రాష్ట్రంలో ఈ సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అంటే పోలింగ్‌కు ఇంకా 24 రోజుల మాత్రమే సమయం ఉంది. అందువల్ల అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఒక్కో అభ్యర్థి పదుల సంఖ్యలో ప్రచార రథాలు, వాహనాలను సమకూర్చుకున్నారు. ప్రచారానికి అవసరమైన మైకులు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, అభ్యర్థుల కటౌట్లతో పాటు తమ అధినేతల ఫొటోలు వంటివన్నీ సిద్ధం చేసుకున్నారు. ఈ వాహనాలకు ఎన్నికల ప్రచార అనుమతులు కూడా తీసుకున్నారు. గురువారం నుంచి వీటిని రోడ్డెక్కించి ఊరూ వాడా తిప్పుతూ హోరెత్తించనున్నారు. ఆ నియోజకవర్గానికి పాత అభ్యర్థి అయితే గతంలో తాను చేసిన అభివృద్ధితో పాటు తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలను, ప్రత్యర్థుల బలహీనతలు, అవినీతి ఆరోపణలను ఏకరువు పెట్టనున్నారు. తొలిసారి బరిలో దిగుతున్న వారైతే తమను గెలిపిస్తే చేయబోయే అభివృద్ధిని, ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించనున్నారు. ఒక్కసారి తనను గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించనున్నారు.




### మండుటెండలు, వడగాడ్పుల్లో..

కొద్దిరోజులుగా మాడు పగిలే మండుటెండలు, వడగాడ్పులు జనానికి దడ పుట్టిస్తున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయంలో ఎన్నికలు రావడం అభ్యర్థులతో పాటు వారి అనుచరగణానికి పరీక్షా కాలంగా మారింది. అయినప్పటికీ ఉష్ణతాపాన్ని లెక్క చేయకుండా ప్రచారాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి. వడగాడ్పులకు జడిసి వెనకడుగు వేస్తే ప్రత్యర్థి ఎక్కడ దూసుకుపోతాడోనన్న భయం అభ్యర్థులను వెంటాడుతోంది. సాధారణంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంటే ఉమ్మడి విశాఖలో తక్కువ ఉష్ణోగ్రతలతో ఒకింత చల్లదనం పరచుకుంటుంది. అలాంటిది ప్రస్తుతం 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఇవి మరింత పెరగనున్నాయి. పోలింగ్‌కు ఇంకా మూడు వారాలకు పైగా సమయం ఉండడంతో ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం వీరికి ఓ సాహసమే అవుతుంది.

### తొలి రోజు పార్లమెంట్‌కు 3, అసెంబ్లీకి 7

మహారాణిపేట: నామినేషన్లు ఘట్టం గురువారం ప్రారంభమైంది. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి తొలి రోజు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం తన చాంబర్‌లో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థిగా వడ్డీ హరి గణేష్ తొలి నామినేషన్ చేయగా.. తరువాత ప్రజాశాంతి పార్టీ నుంచి కె.ఎ.పాల్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పొలమరశెట్టి సత్యవతి నామినేషన్లు దాఖలు చేశారు. వీరు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు.

**4 శాసనసభ నియోజకవర్గాల్లో..**

జిల్లాలోని 4 శాసనసభ నియోజక వర్గాల్లో ఏడు నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. భీమిలి నుంచి గంటా శ్రీనివాసరావు, గంటా రవితేజ తెలుగుదేశం పార్టీ తరపున రెండేసి సెట్లను భీమిలి రిటర్నింగ్ అధికారి యస్.భాస్కర్ రెడ్డికి అందజేశారు. విశాఖ ఉత్తర నుంచి నవభారత్ నిర్మాణ సేవా పార్టీ తరపున చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ తరపున పి.జగదీష్ ఒక్కో నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి డి.అఖిలకు అందజేశారు. గాజువాక నుంచి జాతీయ జనసేన పార్టీ తరపున పల్లి శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పెబ్బిలి సత్యనారాయణమూర్తి, పెందుర్తి నియోజక వర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీ తరపున బంగారి రమణ ఒక్కో నామినేషన్‌ను దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# గంటాపై ఏడు కేసులు

**అఫిడవిట్‌లో వెల్లడి**

తగరపువలస: టీడీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎన్నికల నామినేషన్ సందర్భంగా అఫిడవిట్‌లో పొందుపరిచిన వివరాలివీ..

**మొత్తం చర ఆస్తులు:** రూ.8,39,87,421(వీటిలో ఎన్నికల నిమిత్తం బ్యాంకులో డిపాజిట్లు రూ.2,00,000) ఇతర బ్యాంకుల్లో వివిధ డిపాజిట్లు(ఐసీఐసీఐ ఎంవీపీ కాలనీ రూ.39,36,542, హెచ్‌డీఎఫ్‌సీ ఎంవీపీ కాలనీ రూ.10,68,158, ఎస్‌బీఐ హైదరాబాద్ సచివాలయ బ్రాంచ్ రూ.2,97,018, యూబీఐ కామేపల్లి–ప్రకాశం బ్రాంచ్ రూ.1,571, ఎస్‌బీఐ పార్లమెంట్ బ్రాంచ్, ఢిల్లీ రూ.1,67,340, హెచ్‌డీఎఫ్‌సీ రూ.40,00,000, ఎల్‌ఐసీ పాలసీలు రూ.97,320, రూ.9,70,850(సరెండర్ విలువ) షేర్లు రూ.7,32,48,620

భార్య గంటా శారద పేరు మీద చర ఆస్తులు రూ.2,96,84,154 (వీటిలో ఎన్నికల నిమిత్తం బ్యాంకులో డిపాజిట్ రూ.2,00,000, ఐసీఐసీఐ ఎంవీపీ బ్రాంచ్‌లో రూ.4,66,081, కొటక్ మహీంద్రా విశాఖలో రూ.13,672, ఎల్‌ఐసీ పాలసీ రూ.20,50, 779, ప్రత్యూష రీసోర్స్ అండ్ ఇన్‌ఫ్రా ప్రయివేట్ లిమిటెడ్‌లో షేర్లు విలువ రూ.1,24,800, సన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ రూ.15,00,000, శాంచురీ పార్క్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.13,28, 821, బంగారు ఆభరణాలు రూ.2,40,00,000

**స్థిర ఆస్తులు :** భూముల విలువ రూ.19,18,710(మార్కెట్ విలువ రూ.3,28,29, 640), భవనాల మార్కెట్ విలువ రూ.7,90,66,569

**శారద:** రూ.2,89,41,100(మార్కెట్ విలువ రూ.2,91,59,512) భవనాల మార్కెట్ విలువ రూ.4,09,49,512.

**అప్పులు:** రూ.29,97,624(క్రాప్ లోన్), శారద రూ.85,80,571(గోల్డ్ లోన్)

**క్రిమినల్ కేసులు :** ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో 272/2003, 267/2023, 282/ 2023, 334/2023, వన్ టౌన్ విశాఖపట్నం 238/ 2014, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ 15/2009, 3/18

**గంటా కుమారుడు రవితేజ, అతని భార్య శరణి స్థిరచరాస్తులివే..**

**చరాస్తులు:** రవితేజ రూ.47,11,644, శరణి రూ.7,30,90,278, **స్థిరాస్తులు:** భూముల మార్కెట్ విలువ ప్రకారం రవితేజ రూ.8,46,05,690, శరణి రూ.1,82,40,000, **భవనాలు:** రవితేజ రూ.12,89,86,690, శరణి రూ.9,75,78,782

**అప్పులు:** రవితేజ రూ.2,64,53,842, శరణి రూ.4,92,48,531

**క్రిమినల్ కేసులు :** 202/2024 (పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రంజాన్‌లో కానుకలు పంపిణీ చేసినందుకు రవితేజపై కేసు నమోదైంది.)

### జోన్–5 కమిషనర్‌పై విచారణ!

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన 'జోన్–5 జెడ్సీ అధికార దుర్వినియోగం' అనే కథనానికి అధికారులు స్పందించారు. ముందుగా ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లినట్లు తెలిసింది. అధికార దుర్వినియోగానికి సంబంధించి కమిషనర్ సాయికాంత్ వర్మ, అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆయన్ని ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే ఎన్నికల్లో పక్షపాతధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై కలెక్టర్ మల్లికార్జున జెడ్సీని వివరణ కోరినట్లు తెలిసింది. కాగా.. జోన్–5 కమిషనర్ కృష్ణ అధికార దుర్వినియోగానికి సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిత్యం ఆయన ఇంటి వద్ద 10 మంది వరకు జీవీఎంసీ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు తెలిసింది.జీవీఎంసీ 51వ వార్డు సూపర్‌వైజర్ గణేష్ జెడ్సీ పిల్లలకు సేవకుడిగా ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ జి.గోపి జెడ్సీ ఇంట్లో పని చేస్తున్నట్లు తెలిసింది. డ్రైవర్లు కె. కోటి, ఫణికుమార్‌లు జెడ్సీ వేధింపులు భరించలేక ఉద్యోగాల మానేశారని సహచరులు చెబుతున్నారు. జెడ్సీ జీవీఎంసీ సిబ్బందిని ఇక్కడి నుంచి పలాస తీసుకెళ్లి పనులు చేయిస్తున్నారని వారు వెల్లడించారు.

# ఆప్యాయంగా పలకరిస్తూ..

- ఆర్కే బీచ్‌లో వాకర్స్‌తో మమేకమైన బొత్స ఝాన్సీలక్ష్మి
- విశాఖ సమగ్ర అభివృద్ధిలో భాగమవుతానని వెల్లడి
- చిరువ్యాపారులతో మాటామంతీ
- వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి





వాకర్స్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

బీచ్‌రోడ్డు:

ఆర్కే బీచ్.. గురువారం ఉదయం 6 గంటలు.. కోటేశ్వరరావు అనే వ్యక్తి టీ షాపు నిర్వహణలో బిజీగా ఉన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అక్కడకు వచ్చి అన్నా ఎలా ఉన్నారంటూ ఆప్యాయంగా పలకరించారు. బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం వస్తోందా అని అడగ్గా.. గౌరవప్రదంగా కుటుంబాన్ని పోషించుకునే స్థాయిలో వస్తోందని ఆయన జవాబిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మీకు ఏమైనా లబ్ధి జరిగిందా? అని ఆమె ప్రశ్నించగా... ఇల్లు మంజూరు చేశారని, సొంతంగా ఇల్లు కట్టుకోలేమని చెబితే ప్రభుత్వమే కట్టిస్తోందని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని కోటేశ్వరరావు వివరించారు. మంచి చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆమె అభ్యర్థించారు

- మిల్లెట్స్, రాగిమాల్ట్ వంటి ఆహార పదార్థాలను విక్రయిస్తున్న బంగార్రాజు అనే చిరువ్యాపారితో మాటామంతీ కలిపారు. రాగిమాల్ట్‌ను రుచి చూసి.. మిల్లెట్స్, తులసి టీ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. బంగార్రాజు తనకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.
- వాకింగ్ చేసి కాసేపు సేద తీరుతున్న వృద్ధులకు బొత్స ఝాన్సీ తనను తానుగా పరిచయం చేసుకున్నారు. 'నేను విశాఖ ఆడబిడ్డను. ఎంపీగా రెండుసార్లు పనిచేశాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సారి విశాఖకు సేవ చేసే అవకాశం కల్పించారు. ఎంపీగా నన్ను గెలిపిస్తే.. విశాఖ సమగ్ర అభివృద్ధిలో భాగమవుతా.. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వండి.'అంటూ వారికి విజ్ఞప్తి చేశారు.
- విశాఖలో స్థిరపడ్డ ఉత్తర భారతదేశ ప్రజలతో కాసేపు కలిసి నడిచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విశాఖ అభివృద్ధి చెందిన తీరును వివరించారు. విశాఖ పరిపాలన రాజధానిగా మారితే ఊహించని మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. దేశంలో విశాఖ ప్రముఖ నగరంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు.

ఇలా గురువారం ఉదయం ఆర్కే బీచ్‌లో వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఎన్నికల ప్రచారం సాగింది. మార్నింగ్ వాక్ చేస్తున్న వారిని కలిసి వారితో మమేకమయ్యారు. చిరువ్యాపారులతోనూ ముచ్చటిస్తూ.. ప్రభుత్వ పథకాలు అందాయా? లేదా? అనే విషయాన్ని వాకబు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే విశాఖ అభివృద్ధి శరవేగంగా సాగుతుందని వివరించారు. ఉత్తరాంధ్ర పురోభివృద్ధికి, యువతకు మరిన్ని అవకాశాలు రావాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ఆమె వాకర్స్‌కు వివరించారు.

**బీచ్‌లో భారీ జాతీయ పతాకం ఏర్పాటు చేయాలి**

బీచ్‌లో మార్నింగ్ వాకర్స్ కోసం అవసరమైన సదుపాయాలు కల్పించడానికి.. విశాఖపట్నం సమగ్ర

– మిగతా 8లో



# ఆప్యాయంగా పలకరిస్తూ..

▶ 7వ పేజీ తరువాయి

అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీచ్‌లో కొత్తదనం ఉట్టిపడేలా ఎయిర్ పోర్టు సమీపంలో ఉన్నట్లుగా భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయాలని వాకర్స్ సూచించగా.. మంచి ఆలోచన అని బొత్స ఝాన్సీ అన్నారు. అధికారంలోకి రాగానే ఈ అంశంపై చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కొంత మంది నడి వయసులోని వాకర్స్‌తో మాట్లాడుతూ.. తాను విశాఖలో పుట్టానని, ఆంధ్ర యూనివర్సిటీతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. పుట్టిన ప్రాంతానికి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని వారిని కోరారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో బొత్స ఝాన్సీతో పలువురు సెల్ఫీలు తీసుకుని.. తమ మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ ఉషశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

## ప్రచార పర్వం

**కాస్త ఓపిక పట్టు.. ఇంటికే పింఛన్:** ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్కిరెడ్డిపాలెంలో ఓ వృద్ధుడిని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఆప్యాయంగా పలకరించారు. పెద్దాయన ఎలా ఉన్నారు? ఈ నెల పింఛన్ తీసుకున్నారా? అని అడగ్గా.. ఈ నెల పింఛన్ కోసం చాలా ఇబ్బందులు పడ్డానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క నెల ఓపిక పట్టండి. తిరిగి మీ ఇంటి వద్దకే పింఛన్ వచ్చే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వస్తుందని ఆయనకు అమర్‌నాథ్ భరోసా ఇచ్చారు.

- అక్కిరెడ్డిపాలెం





సాయిరాంకాలనీలో ఇస్త్రీ చేసి.. ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- మధురవాడ

గోకుల్‌నగర్‌లో చిరు వ్యాపారితో మాట్లాడుతూ దోసె వేస్తున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి

- కంచరపాలెం





# వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 75వ వార్డుకు చెందిన జనసేన నాయకుడు ధర్మాల రాజారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఆ పార్టీ కార్యకర్తలు, మహిళలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజారెడ్డిలాంటి సీనియర్ జనసేన నాయకుడు వైఎస్సార్ సీపీలోకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాజారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మెచ్చి పార్టీలో చేరామన్నారు. అమర్‌నాథ్ విజయం కోసం కష్టపడి పని చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక వైఎస్సార్ సీపీ అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, గొందేశి సత్యారావు, మద్ది శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 55వ వార్డు నుంచి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని ఎన్నికల ప్రచార కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ చైర్మన్ నూనెల పోలారావు, బోరా నర్సింగరెడ్డి, బోర వెంకటరమణారెడ్డి, బోర వరశంకరరెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, తీరపు అచ్చియ్యమ్మ, ఏలూరు సత్యవతి, బోరా రమ్య, నంబారు మహేష్, బోట్టా శంకర్, బొట్ట గిరీష్, బీజేపీ నుంచి సీనియర్ నాయకులు ఆంటోని, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన జనసేన నాయకులతో వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో పార్టీలో చేరిన 55వ వార్డు కాంగ్రెస్, బీజేపీ నాయకులు

# నేరుగా ఎదుర్కోలేక టీడీపీ తప్పుడు ప్రచారం



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి

- ఇక్కడి నుంచే పోటీ చేసి విజయం సాధిస్తా..
- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి

**మధురవాడ:** భీమిలిలో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని తట్టులేక, తనను నేరుగా ఎదుర్కోలేక గంటా శ్రీనివాసరావు, అతని అనుచరులు తాను నియోజకవర్గం మారుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 5వ వార్డు సాయిరాం కాలనీలో గురువారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ రోజుకో కుట్రలు పన్ని తానపై దుష్ప్రచారం చేస్తోందని, తాజాగా అనకాపల్లి ఎంపీగా వెళ్తున్నట్లు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇది పూర్తిగా తప్పుడు ప్రచారమని, ప్రజలు నమ్మవద్దని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో భీమిలి నుంచే పోటీ చేస్తానన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిచి సీఎం జగన్‌కు ఈ సీటును బహుమతిగా ఇద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

# విశాఖ ఎయిర్‌పోర్టు దూకుడు!

- 27 లక్షలు దాటిన ప్రయాణికులు
- గత ఏడాది కంటే 10.19 శాతం పెరుగుదల

**సాక్షి, విశాఖపట్నం:** ప్రయాణికుల తాకిడిలో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం దూకుడులో ఉంది. ఏటికేడాది ఈ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా 2023–24 ఆర్థిక సంవత్సరంలోనూ అదే తీరును కనబరిచింది. 2022–23లో ఈ విమానాశ్రయం నుంచి 25,00,654 మంది రాకపోకలు సాగించగా, ఈ సంవత్సరం 27,84,428కు పెరిగారు. గతేడాదితో పోల్చుకుంటే 2,85,974 మంది అధికంగా ప్రయాణించారు. అంటే 10.19 శాతం వృద్ధి రేటు నమోదైంది. కాగా 2022–23లో దేశీయ ప్రయాణికులు 24,35,320 మంది, విదేశీ ప్రయాణికులు ఉండగా, 2023–24లో దేశీయ ప్రయాణికులు 27,18,314, విదేశీ ప్రయాణికులు 66,116 మంది ఉన్నారు. ఈ లెక్కన గత ఏడాదికంటే స్వదేశీ ప్రయాణికులు 2,83,774 మంది, విదేశీ ప్రయాణికులు 2,982 మంది పెరిగారన్న మాట! గత మే నెలలో అత్యధికంగా 2,96,628 మంది, అత్యల్పంగా ఫిబ్రవరిలో 1,96,013 మంది ప్రయాణాలు సాగించారు. మరోవైపు ఈ విమానాశ్రయం నుంచి దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ఈ నెల 9న విశాఖ నుంచి బ్యాంకాక్‌కు కొత్త అంతర్జాతీయ సర్వీసు, 16న హైదరాబాద్‌కు రెండు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈనెల 26న మలేసియాకు మరో కొత్త విమాన సర్వీసును ప్రారంభించనున్నారు. అలాగే పెరుగుతున్న ప్రయాణికులు, విమాన సర్వీసులను దృష్టిలో ఉంచుకుని ఈ ఎయిర్‌పోర్టులో మరిన్ని సదుపాయాలను సమకూరుస్తున్నారు. ప్రయాణ ప్రక్రియ వేగవంతం, సులభతరమయ్యేందుకు వీలుగా ఇన్‌లైన్ బ్యాగేజీ స్క్రీనింగ్, డిజి యాత్ర సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల రాకపోకల్లో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం మూడు మిలియన్ల (30 లక్షల) మైలు రాయిని అధిగమిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.కుమార్‌రాజా, ఒ.నరేష్‌కుమార్, డీఎస్ వర్మ తెలిపారు.



## ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శులు

### రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

**పెందుర్తి:** ఇంటికి పన్ను వేసే విషయమై లంచం తీసుకుంటుండగా పెందుర్తి మండలం వాలిమెరకజుత్తాడ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–1వి.సత్యనారాయణతో పాటు గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి విక్టర్ ప్రవీణ్ ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలివి..జుత్తాడలోని తన తల్లి పేరుమీద ఉన్న ఇంటికి పన్ను వేయాలని గురాల కౌశిక్‌రాజ్ అనే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి వి.సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి ప్రవీణ్‌లను కోరాడు. పన్ను వేయాలంటే రూ.8 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు కార్యదర్శి అడిగిన నగదు కార్యదర్శి సత్యనారాయణకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన కార్యదర్శులు

## కేజీహెచ్‌లో అంకాలజీ ఐసీయూ

**మహారాణిపేట:** కేజీహెచ్ క్యాన్సర్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ అంకాలజీ ఐసీయూని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం గురువారం ప్రారంభించారు. అనంతరం యూనిట్‌లో పరికరాలను పరిశీలించారు. వసతుల కల్పనపై డీఎంఈ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఐసీయూని బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, క్యాన్సర్ యూనిట్ హెచ్‌వోడీ డాక్టర్ శిల్పా, ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మి తులసీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఏవో నాగేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అంకాలజీ ఐసీయూని ప్రారంభిస్తున్న డీఎంఈ నరసింహం, సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

## డేటా లింక్ బ్రిడ్జ్ టెక్నాలజీలో ఏయూకు పేటెంట్

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఆచార్యులు డి.లలితభాస్కరి, పరిశోధక విద్యార్థి డాక్టర్ ఎస్.కె.ఎ.మనోజ్‌లకు ఇండియన్ పేటెంట్ ఆఫీస్ పేటెంట్ మంజూరు చేసింది. వారు కొత్తగా అభివృద్ధి చేసిన డేటా లింక్ బ్రిడ్జ్ టెక్నాలజీకి పేటెంట్ సాధించారు. ఈ విధానంలో అత్యంత భద్రతలో సమాచారాన్ని పంపే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఆచార్య లలిత భాస్కరిని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



లలిత భాస్కరిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

## వీఎన్‌సీ, ఎంఎఫ్‌సీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

**మహారాణిపేట:** కేంద్రీయ మత్స్య నావిక, ఇంజినీరింగ్ శిక్షణా విభాగం ఆధ్వర్యంలో వెస్సెల్ నేవిగేటర్(వీఎన్‌సీ), మెరైన్ ఫిట్టర్(ఎంఎఫ్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సులకు విశాఖ, కొచ్చి, చెన్నై ఏరియాల్లో శిక్షణ ఉంటుంది. పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులు. ఈ ఏడాది ఆగస్టు నాటికి 15 నుంచి 20 సంవత్సరాల్లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు మినహాయింపు ఉంటుంది. అఖిల భారత స్థాయిలో కామన్ ఎంట్రాన్స్ టెస్ట్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తులను www.cifnet.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకుని, జూన్ 14వ తేదీలోగా ది డైరెక్టర్, cifnet, fine arts avenue, cochin-682 016 చిరునామాకు పంపాలి.

# గంగవరం పోర్ట్ కార్మికులతో చర్చలు విఫలం

**పెదగంట్యాడ:** గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులు, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో యాజమాన్య ప్రతినిధులతో బుధవారం అర్ధరాత్రి వరకూ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 8 రోజులుగా పోర్టు గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ స్పందించారు. ముందుగా కార్మికులతో భేటీ అయ్యారు. వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ కింద ఒక్కో కార్మికునికి రూ.50 లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో కార్మికులకు జీతం నెలకు రూ.36వేలు ఇవ్వాలని కార్మికులు తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలందించాలని, విధి నిర్వహణలో ఎవరైనా కార్మికులు మరణిస్తే రూ.25 లక్షలు ఇవ్వాలనన్నారు. దీంతో యాజమాన్య ప్రతినిధులతో సీపీ భేటీ అయ్యారు. కార్మికుల డిమాండ్లను వారికి వివరించారు. స్పందించిన యాజమాన్య ప్రతినిధులు తొలుత రూ.16 లక్షలు ఇచ్చి వన్ టైం సెటిల్‌మెంట్ చేస్తామని చెప్పడంతో కార్మికులు అంగీకరించలేదు. రూ.40 లక్షలు ఇవ్వాలన్నారు. ఆపై యాజమాన్య ప్రతినిధులు రూ.20 లక్షలే ఇస్తామన్నారు. దీంతో రూ.35 లక్షలు ఇవ్వాలని నిర్వాసిత కార్మిక కమిటీ సభ్యులు కోరారు. ఇరువర్గాలు అంగీకరించకపోవడంతో చర్చలు వాయిదా పడ్డాయి.



గంగవరం పోర్టు గేటు వద్ద మోహరించిన పోలీసులు

# బొగ్గు సంక్షోభం నివారణకు వేగంగా చర్యలు

**ఉక్కునగరం:** బొగ్గు సంక్షోభం నివారణకు వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గురువారం ప్రకటించింది. అదానీ గంగవరం పోర్ట్ కార్మికుల ఆందోళన నేపథ్యంలో ఏర్పడిన బొగ్గు కొరత నివారణకు తీసుకుంటున్న చర్యలను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ వివరించారు. పోర్టులో కొంత బొగ్గుతో పాటు అదానీ పోర్టు వద్దకు చేరిన లక్షన్నర టన్నుల కోకింగ్ కోల్ ఉన్న నౌకలు బెర్తింగ్ కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. పోర్టులో ఉన్న దాదాపు 2.2 లక్షల టన్నుల బొగ్గును తీసుకురావడం కోసం జిల్లా పరిపాలన వ్యవస్థ సహాయాన్ని కోరామన్నారు. అదానీ పోర్టు బయట ఉన్న రెండు నౌకలను వైజాగ్ పోర్టుకు మళ్లించడం, ప్రత్యామ్నాయ ఓడరేవుల నుంచి 50 వేల టన్నుల బొగ్గును రుణం తీసుకోవడం, లక్షన్నర టన్నుల బొగ్గు అత్యవసర సేకరణ కోసం గ్లోబల్ టెండర్‌కు వెళ్లడం వంటి చర్యలను తీసుకుంటున్నట్లు వివరించారు. తాజా పరిస్థితిని అధిగమించడానికి, పరిష్కారాల కోసం స్టీల్‌ప్లాంట్ దృఢసంకల్పంతో కృషి చేస్తోందన్నారు.

## ఫ్లక్స్ ప్లాంట్ ప్రారంభం

**పరవాడ:** పరవాడ సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో నూతన మోల్డ్ ఫ్లక్స్ తయారీ ప్లాంట్‌ను వెసువియస్ గ్రూప్ సీఈవో పాట్రిక్ ఆంద్రీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంద్రీ మాట్లాడుతూ దేశంలో తమ తయారీ సామర్థ్యాలను మరింతగా పెంచడానికి పెట్టుబడి వ్యయాన్ని రూ.1000 కోట్ల వరకు పెంచుతున్నట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్లలో నిరంతర కాస్టింగ్ ప్రక్రియలో ముఖ్య భాగం అయిన ఫ్లక్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ ప్లాంట్ దోహదపడుతుందన్నారు. దేశంలో మా వృద్ధి ఆధారంగా ముందుగా పేర్కొన్న రూ.500 కోట్ల పెట్టుబడి ప్రణాళికలను అధిగమించి రాబోవు కొన్ని సంవత్సరాల్లో రూ.1000 కోట్ల పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నామని సీఈవో ఆంద్రీ చెప్పారు. భారతదేశం ఎల్లప్పుడు మా గ్రూప్‌కు వ్యూహాత్మక మార్కెట్‌గా ఉందన్నారు. కార్యక్రమంలో వెసువియస్ ఇండియా (వీఐఎల్) చైర్మన్ బిశ్వదీప్ గుప్తా , వీఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ నితిన్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లక్స్‌ప్లాంటును ప్రారంభిస్తున్న వెసువియస్ గ్రూప్ సీఈవో పాట్రిక్ ఆంద్రీ